## కౌలుదారు కాలంతో రైతులకు కష్టాలే..



ధరణి రాకముందు భూములకు సంబంధించిన రికార్డులన్నీ తిక్క తిక్క ఉండేవి. చేసుకునేటోడు ఒక్కడయితే.. రికార్డుల్లో పట్టాదారు ఇంకొక్కడు ఉంటాడు. కబ్జాలో వేరేవాడు ఉంటాడు. ఆఫీసులో వీఆర్వో ట్రాన్స్‌ఫర్ అయితే చాలు కబ్జా కాలంలో పేర్లు మారిపోతుండె. పాసు పుస్తకంలో కూడా భూమి ఎక్కువ, తక్కువగా మారిపోతుండె. పాలోల్లతోటి, పక్క పొలం వాల్లతోటి ఎప్పుడూ ఇవే పీకులాటలు ఉండటం వల్ల చాలామంది రైతులు పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. బీఆర్‌ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ మొత్తం అధికారాలు తాసీల్దార్‌కే ఇచ్చిండు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా రిజిస్ట్రేషన్ ఆఫీసుకు పోకుండా ఇప్పుడు తాసీల్దార్ ఆఫీసులనే పని అయిపోతుంది. భూముల రిజిస్ట్రేషన్ మొత్తం తాసీల్దార్ ఆఫీసులనే పెట్టించుండు. ఆన్‌లైన్‌తో పదే పది నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తైయిపోతుంది. ఒక్క వేలిముద్ర పెడితే చాలు మన పేరుమీద భూమి రిజిస్ట్రేషన్ జరిగిపోతుంది. ఈ పోర్టల్‌తో ఎలాంటి భూమి సమస్యలున్నా.. ఆన్‌లైన్‌లో భూమి భద్రంగా ఉంటది. అలాంటిది కాంగ్రెసోళ్లు ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తామనడం, రద్దుచేస్తామనడం సరికాదు. రైతులకు మంచి చేయకపోయినా ఫర్వాలేదు కానీ మంచి చేసే ధరణిని తీసేస్తాననడం అస్సలు మంచిదికాదు. రైతులకు మంచి జరిగితే కాంగ్రెసోళ్లు ఓర్వలేకపోతున్నారు. మళ్లీ దళారుల రాజ్యం తీసుకొచ్చేందుకే ధరణిని తీసేస్తామంటున్నారు. కౌలుదారు కాలం పెడతామంటున్నారు. ధరణిని తీసేస్తే భూమి సమస్యలు పెరిగి ఊర్లల్ల పంచాయితీలు ఎక్కువైతాయి. కోర్టుల్లోనూ ఇవే పంచాయితీలు ఉంటాయి. కౌలుదారు కాలం పెడితే భూమి యజమానికి కష్టాలు తప్పవు. కట్టె విరగొద్దు.. పాము సావొద్దు అన్నట్లు కోర్టుల పంచాయితీలు నడుస్తాయి. రైతులు సచ్చే వరకు కూడా సమస్యలు తీరక ఇబ్బందులు పడతారు. ఇలాంటి భూమి సమస్యలు లేకుండా రైతులందరూ సంతోషంగా గడపాలంటే మల్ల కేసీఆర్ సారే సీఎం కావాలి. అప్పుడే రైతుల రాజ్యం వస్తది.

**- వెంకటస్వామి, ఆరెపల్లి, ఆత్మకూరు**

## పైరవీకారుల ప్రమేయం ఉండదు..



ధరణి పోర్టల్ వచ్చినప్పటి నుంచి తాసీల్దార్ కార్యాలయాల్లో పైరవీకారుల ప్రమేయం లేదు. రైతు పట్టాదారు పాసుబుక్కు, ఆధార్‌కార్డు తీసుకెళ్లి తను ఎవరికైతే అమ్మాలనుకున్నా లేదా దానం ఇవ్వాలన్నా, వారసత్వం చేయాలన్న ధరణి పోర్టల్‌లో సులభంగా చేస్తున్నాడు. గతంలో పైరవీకారుల సూచన మేరకు చేపించుకుంటునేవాళ్లు. అందులో ఆయన ఎన్ని డబ్బులు తీనేది రైతుకు తెలిసేది కాదు. గతంలో రైతు రెండెకరాలు అమ్మితే పైరవీకారులు, అధికారులు అవతలివాళ్లతో కుమ్మక్కై మూడు, నాలుగు ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘటనలు చాలా ఉన్నాయి. కాని ధరణి వల్ల అట్లాంటి మోసాలు జరగడానికి అవకాశాలు లేవు. ఏవైనా అవకతవకలు ఉంటే కలెక్టర్ ఆమోదం తెలిపితేనే తప్పా పట్టా మార్పిడి జరగదు. అటువంటి వెసలుబాటు ధరణిలో ఉంది. దళారుల ప్రమేయం లేకుండా రైతు తన భూమిని తను రక్షించుకోవడానికి వీలుంది. రైతు ఆమోదం లేకుండా ఇతరలు అన్యాయం చేయడానికి వీల్లేదు. ధరణితో రైతులు భూ మార్పిడి చేయడానికి సౌకర్యవంతంగా ఉంది. రైతుకు మేలు జరిగే ఇలాంటిది కచ్చితంగా ఉండాలి. కాంగ్రెస్ నాయకులు ధరణి తీసేస్తామంటే రైతులు ఆగమైపోతారు ఇది నిజం.

**-టి.కె.కుర్మన్న రిటైర్డ్ డిప్యూటీ తాసీల్దార్, తిర్మలాయపల్లి, మదనాపురం మండలం**

## ఐదు వేళ్లు నోట్లెకి పోతున్నాయి..



గత 22 ఏండ్లుగా నేను వెల్డింగ్ వర్క్ చేస్తున్న. ట్రాక్టర్ ట్రాలీలు, కేజీ వీల్స్, రైతులకు సంబంధించిన ఇతర వ్యవసాయ పనిముట్లు ఎక్కువ తయారు చేస్తాను. మాకు కరెంట్ ఉంటేనే పని ఉంటది. లేకుంటే ఉరికనే ఉండాల్సి వస్తది. నేను వెల్డింగ్ పని నేర్చుకున్నకానుంచి ఎప్పుడు చూడలే ఇప్పటిలాగ కరెంట్. తెలంగాణ రాకముందు వరకు ఘోరమైన కరెంట్ కటింగ్స్ ఉంటుండె. పగలు పూట కరెంట్ ఉండుకమనేదే కష్టంగా ఉండె. ఎప్పుడు కరెంట్ ఉంటే అప్పుడు పని చేసుకునేవాళ్లం. గంటా.. రెండుగంటలు ఉండే కరెంట్‌తోనే పనులు చేసుకొని బతికేటోళ్లం. కరెంట్ ప్లాబ్లంతోటి ఆర్డర్ వచ్చిన గిరాకీకి టైమ్‌కు సామాన్లు ఇచ్చేవాళ్లం కాదు. నెలలు నెలలైనా పనులు పూర్తికాక కస్టమర్‌తో తిట్లు తినాల్సి వస్తుండె. ఆర్డర్ తీసుకునేటప్పుడే ఒత్తిడి లేకుండా లేట్ టైమ్ చెప్పి తీసుకునేటోళ్లం. అసొంటిది ఈరోజు ఐదు వ్రేళ్లు నోట్లెకి పోతున్నాయంటే సీఎం కేసీఆర్ ఇస్తున్న 24గంటల కరెంట్ ఇస్తున్నందుకె. లేకపోతె పనులు బంద్‌చేసుకొని కూర్చునేవాల్లం. కరోనా టైమ్‌ల కొంచెం ఇబ్బంది పడినం కానీ కరెంట్‌తో ఇబ్బందులే లేవిప్పుడు. కరెంట్ ఫుల్లుగా ఉండేటందుకు రైతులు కూడా సంతోషంగా ఉన్నారు. వ్యవసాయం మస్తుగా చేస్తుండ్రు. మాకు గిరాకీ కూడా బాగుంది. ట్రాలీలు, కేజీ వీల్స్, ఇంకా చాలా వ్యవసాయం సామాన్లు గిరాకీతో ఫుల్లు పని ఉంటుంది. నాతోపాటు పది మందికి పని కల్పించి ఉపాధి ఇస్తున్నాను. వ్యవసాయం మంచిగ నడుస్తున్నందుకే మాకు పని ఫుల్లుగా ఉండి అందరం సంతోషంగా బతుకుతున్నాం. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుభీమా, సబ్సీడి ఎరువులు ఇట్లా అన్నీ ఇచ్చి వ్యవసాయాన్ని పండుగలెక్క చేసిండు కేసీఆర్. ఇప్పుడు కాంగ్రెసోళ్ల 3గంటల కరెంట్ అంటే ఏమైతదో అని భయమైతుంది. అదేకనుక జరిగితే రైతులు ఆగమైతరు. మేము గోస పడతాం. రైతు దేశానికి వెన్నెముక్క అంటారు.. సీఎం కేసీఆర్ అదే ఆచరించి రైతులను బతికిస్తున్నాడు. కాంగ్రెసోళ్ల మాటలు వింటే మళ్లీ పాతకష్టాలే వస్తాయి. ఈసారి ఎలక్షన్‌లో ప్రతీఒక్కరూ ఆలోచించి ఓటెయ్యాలి. కేసీఆర్ సారే మళ్లీ వస్తే అందరికీ బాగుంటాది.

**- జి. రంగారెడ్డి, వెల్డర్, ఆత్మకూరు**

## మళ్లీ పడిగాపులు తప్పవు..



కరెంట్ తగ్గిస్తే రైతులకు మళ్లీ పడిగాపులు తప్పవు. పనులు ఆగం కావడం ఖాయం. వ్యవసాయనికి సాగునీరు ఎంత ముఖ్యమో కరెంట్ కూడా అంతే ముఖ్యం, సాగు అనేది నిత్య ప్రక్రియ. దానికి సమయమంటూ ఉండదు. ఏ సమయంలో ఏం పని చేస్తడో రైతుకే పాలుపోదు. ఒక్కోసారి నారుమడి కోసం చల్లడానికి నీళ్లు అవసరమైతయ్. అలాగే నారు కోసం నీరు అవసరమైతది. ఈ పనులకు సమయం ఉండదు.. సాగుతా పోతవి. ఇంత పెద్ద శాత ఉండే సేద్యానికి మూడుగంటల కరెంట్ అంటే అన్ని వదులుకొని బోర్లకాడ కూసోవాలె. మూడుగంటల కరెంట్ వస్తే మా పిల్లల్ని స్కూల్ మాన్పిచ్చి అందరం సేను కాడనే ఉండాల్సి వస్తది. పంట తీసిన తర్వాత కొత్త పంటకి పది ఆస్పర్ల మోటార్‌తో భూమిని తడపాలంటే ఎకరానికి రెండ్రోజులు పడ్తది. అటువంటిది, మూడుగంటల, ఐదు కరెంట్ అయితే కొంచమే పారుతది. మళ్లీ మరుసటి రోజు కూడా అంతే పారుతది. మరి ముందుకు ఎట్ల పోతదో కాంగ్రెసోళ్లే చెప్పాలి. కాబట్టి 24 గంటల కరెంట్ ఉంటేనే సేద్యమైతది. భూమి కూడా బస్తీ అయితది. లేకపోతే దున్నడానికి ఇబ్బందులే, పంట కోయడానికి, పంట వేయడానికీ ఇబ్బందులే ఉంటవి. కాబట్టి కాంగ్రెస్‌కు రైతుల గురించి ఏం తెల్వదు. ఆ పార్టీని నమ్ముకుంటే మనకు కన్నీళ్లు తప్పవు. 24 గంటల కరెంట్ ఉండాలి. రైతుకు భీమా ఉండాలి. కుటుంబం భరోసాగా ఉండాలంటే కారు గుర్తే మాకు దిక్కు.

**- కుర్వ వీరేశ్, రైతు, ధరూర్**

## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

# కాంగ్రెసొస్తే తిప్పలే..





- 24 గంటల కరెంట్‌పై హస్తం నేతల అక్కసు
- ధరణి తీసేసి భూమాత తెస్తామని ప్రగల్భాలు
- కాంగ్రెస్ అర్థంపర్థంలేని వ్యాఖ్యలపై రైతన్న ఫైర్
- ఓటుతో రేవంత్‌కు బుద్ధి చెబుతామని అల్టిమేటం

## కాంగ్రెస్ ఏమీ చేయలేదు



తెలంగాణ ప్రభుత్వం గుంట భూమి ఉన్న ప్రతి రైతుకూ రైతుబంధు, రైతు బీమాతో అదుకుంటుంటే, కాంగ్రెస్ నాయకులు కౌలు రైతుల పేరిట మోసం చేసేందుకు కుట్రపన్నుతున్నారు. రైతు భరోసా అనే పథకాన్ని ప్రవేశపెట్టి కౌలు రైతులకు వర్తింపజేస్తామని చెబుతున్నారు కానీ దానికి సంబంధించిన పూర్తి వివరాలను చెప్పడం లేదు. మరి కౌలు రైతులను ఎలా గుర్తిసారో ముందే చెప్పాలి. ఈ పథకం ద్వారా పట్టాదారు, కౌలు రైతుల మధ్య తగాదాలు చోటుచేసుకుంటాయి. కాంగ్రెస్ ఏపథకం ప్రవేశపెట్టినా అది కేవలం రాజకీయ లబ్ధికోసమే. రైతులు కాంగ్రెస్ నాయకులను గానీ పార్టీని నమ్మే పరిస్థితి లేదు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏమిచేయదు, వాళ్లు కేవలం ఓట్లకోసం పథకాలు పెడతారేతప్పా..వాటిని అమలు చేయరు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి రద్దు చేసి భూమాత పోర్టల్ తీసుకొస్తామంటున్నారు .అందులో కౌలు రైతులకు అనుకూలంగా కాలమ్ పెడతామని చెబుతున్నారు. ఇలా చేయడం ద్వారా భవిష్యత్‌లో భూ యజమానికి నష్టం చేకూరతది. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు చేస్తే మా కష్టాలను మేమే కొనితెచ్చుకున్నట్లు అవుతున్నది. వాళ్లను నమ్మి మళ్లీ మోసపోం. మా బతుకులను బాగు చేసిన కేసీఆర్‌కే మాఓటు.

**-గోవింద్ నాయక్, సూర్యతండా, మల్కిమియన్‌పల్లి, ఖిల్లాఘణపురం మండలం**

## కరెంట్ కష్టాలు కొనితెచ్చుకున్నట్లే..



కాంగ్రెసోళ్లు 70ఎండ్లు పాలించి రైతులకు చెంసిందేముంది? రాత్రిపూట కుటుంబాన్ని వదిలి మోటర్లకాడ కాపలాకాసిన రోజులు ఇంకా మరువలే. విషపురుగులు కర్చి ఎంతోమంది రైతులు మరణించిన ఘటనలు ఎన్నో. విషపురుగుతో సావాసం చేస్తూ బిక్కుబిక్కుమంటూ వచ్చిరాని కరెంట్ తో పడిన కష్టాలు కేసీఆర్ అధికారంలోకి రాగానే మాయమయ్యాయి. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే మళ్లీ ఆ కష్టాలను కొనితెచ్చుకున్నట్లే ఐతది. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులది ఒక్కొక్కరిది ఒక దారి. రైతులను మోసం చేయడమే వారి లక్ష్యం. ఆ నాయకులు మూడు గంటల కరెంటంటూ ఊళ్లల్లోకి వస్తే తరిమికొడ్తం. రైతులకు 24గంటల కరెంట్ ఇచ్చి దిగుబడులను పెంచింది బీఆర్‌ఎస్ సర్కారే. గతంలో ఎటుచూసినా బీడు భూములే కనిపించేవి. గత పదేండ్లలో అవన్నీ కనుమరుగయ్యాయి. ఇదంతా సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలకు అందించిన వరం.

**- వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు, రాజోళి మండలం**

## 10హెచ్‌పీ మోటర్లు రైతులకు భారమే..



నాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. కాంగ్రెస్ నేతలు చెబుతున్న మాటల ప్రకారం 10హెచ్‌పీ ఒక్కో మోటార్ పంపుసెట్‌కు చాలా డబ్బులు వరకు ఖర్చు అవుతుందని అంటున్నారు. మాలాంటి సన్న, చిన్న కారు రైతులకు 10హెచ్‌పీ మోటార్లు భారంగా మారే అవకాశం ఉంది. అంతేకాకుండా తాము వేసిన బావులు, బోర్లలో సమృద్ధిగా నీరు లేనప్పుడు 10హెచ్‌పీ మోటార్లు వేస్తే ఏమి ఉపయోగం ఉంటుంది. గత ప్రభుత్వాల హయాంలో కరెంట్ ఎప్పుడు వచ్చి పోతుందో అర్థం కాక రాత్రి వేళల్లో పడికాపులు పొలాల్లో నీరు పారించేవాళ్లం. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 24గంటల కరెంట్ వల్ల రాత్రిపూట నీళ్లు పారించే బాధ తప్పింది. ఇప్పుడిప్పుడే బాధలు తప్పుతున్న తరుణంలో మళ్లీ కాంగ్రెసోళ్లు మళ్లీ రైతులకు కరెంట్ కుప్పటి పెడుతున్నారు. వాళ్ల కల్లబొల్లి మాటలు ప్రజలు ఎవరూ నమ్మవద్దు. మూడు గంటల కరెంట్‌తో పని సాగదు.

**-శ్రీనివాస్‌రెడ్డి, పాన్‌గల్ గ్రామం**

## రైతులను నట్టేట ముంచడం ఖాయం



కాంగ్రెస్ వచ్చి ధరణి తీసేస్తే మళ్లీ వీఆర్వో వ్యవస్థ వచ్చి రైతులను నట్టేట ముంచడం ఖాయం. లంచం ఇస్తే ఒకరి పట్టా ఒకరికి మార్చే వీఆర్వో వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ తీసుకురావాలని కుట్రలు చేస్తుంది. ధరణి రాకముందు తెలంగాణలో ఎలాంటి పరిస్థితి ఉండేదో అలాంటి పరిస్థితి మళ్లీ తీసుకురావాలని కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుంది. రైతులను నట్టేట ముంచి దోచుకునే ప్రయత్నం చేస్తున్నా కాంగ్రెస్‌ను రైతులు ఎవరూ నమ్మి పరిస్థితిలో లేరు. రైతుల అభివృద్ధి కోసం పాటుపడే తెలంగాణ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి కుంట భూమి ఉన్న రైతలకు కూడా రైతుబంధు, రైతు బీమా కల్పిస్తున్నారు. పైరవీలు కొట్లాటలు గొడవలు లేకుండా గంటలో రిజిస్ట్రేషన్ , మ్యుటేషన్ పూర్తిచేసుకుని వెంటనే ఈ-పాస్‌బుక్కు నకాలు తీసుకుంటున్నాం. ఎన్ని తపస్సులు చేసినా రైతులు ఎవరూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వరు. తెలంగాణలో మూడోసారి కేసీఆర్ ప్రభుత్వం రావడం ఖాయం. రైతుల మద్దతు పూర్తిగా కేసీఆర్ ప్రభుత్వానికి ఉంటుంది.

**- గోవిందు ,రైతు శేరుపల్లి , శ్రీరంగాపూర్ మండలం**

## దళారీల బాధలు తప్పవు..

తెలంగాణ సర్కారు రైతుల కోసం తెచ్చిన ధరణితో శానా బాగుంది. ఇది వచ్చినకం భూమి రిజిస్ట్రేషన్ కోసం దళారీలకు పైసా ఇయ్యాల్సిన పని లేకుండా పోయింది. మధ్యవర్తులు లేకుండనే రిజిస్ట్రేషన్లు అయితున్నయ్. పైసల్ ఆన్‌లైన్‌ల కట్టంగనే పని అయిపోతుంది. దళారీలకు డబ్బులిచ్చి మోసపోయే బాధలు తప్పినయ్. భూమి రిజిస్ట్రేషన్‌కు ఇస్తున్న పైసలన్నీ ప్రభుత్వానికి చేరుతున్నయ్. ఎలాంటి సమస్యలు లేకుండా పనులైతున్నయ్. రైతుల భూములకు రక్షణ కావాలంటే ధరణి ఉండాల్సిందే. ధరణి పోతే దళారుల రాజ్యం వస్తది. ధరణి లేక ముందు రికార్డులన్నీ పట్వారీ చేతిలో ఉండేవి. ఒకరి భూములను మరొకరి పేరుమీద మార్చేవారు. ఇదంతా తెలియకపోతుండే. మనకు అవసరమున్నప్పుడు పోతే ఆ భూమి మరొకరి పేరుమీద ఉంటుండె. ఇప్పుడు ధరణితో ఎక్కడ ఉన్నా భూ వివరాలను తెలుసుకోవచ్చు. ఇది రైతులకు ఎంతో మేలు చేస్తుంది.

**- చంద్రశేఖర్‌గౌడ్, ఉప్పల, అయిజ**



## రైతులను అప్పులపాలు చేయనిక్కె కుట్ర..



కాంగ్రెసోళ్లు వ్యవసాయానికి మూడుగంటల కరెంట్ చాలంటున్నరు. మూడుగంటల కరెంట్ ఎట్ల సరిపోతది? ఆ కరెంటుతో మూడు గుంటల భూమి కూడా తడ్వదు. ఆ పార్టీ వాళ్లు అధికారంలోకి వస్తమని పగటి కలలు కంటున్నరు. వారి ఎన్నికల మ్యానిఫెస్టోలో మోసపూరిత హామీలు పెట్టి, ఏదో పిట్టకథలు చెబ్తున్నరు. కాంగ్రెస్ హయాంలో ఎన్నో ఇబ్బందులు పడ్డం. కరెంట్ లేక నాకున్న 24 ఎకరాలకు నీరు పారించనిక్కె రాత్రుళ్లు జీతగాళ్లతో కలిసి జాగారం చేసెటోళ్లం. కరెంట్ ఎప్పుడు వస్తదో.. ఎప్పుడుపోతదో అర్థం కాకుండె. నాటి కరెంట్ కష్టాలు ఇప్పటికీ మర్చిపోలె. తెలంగాణ సర్కారు 24 గంటల కరెంటిస్తుంది. రెండు పంటలు పండిస్తున్న. మూడు గంటల కరెంట్ సరిపోతదని రేవంత్‌రెడ్డి అంటున్నడు. ఆ కరెంట్ చేన్లు తడపనిక్కె ఏ మూలకు సరిపోదు. 10 హెచ్‌పీ మోటర్లను బోర్లకు బిగించుకోవాలంటున్నడు. 10 హెచ్‌పీ మోటర్లు బిగిస్తే బోర్లు నాశనమైతయ్. అంటే రైతులను మళ్లీ అప్పుల చేసేందుకు కాంగ్రెసోళ్లు కుట్ర చేస్తున్నరు. వీళ్ల లెక్కలన్నీ గిట్లనే ఉంటయి. వీళ్లకు ఎద్దెర్కలేదు. ఎవుసం ఎర్కలేదు. రైతుకు లాభం చేసే మాట చెప్పుడు చేతకాకుంటే ఊకోవాలి. గిట్ల రైతులను ముంచనిక్కె సూడొద్దు. కాంగ్రెసోళ్ల మాటలు రైతులెవరు ఇంటరు. కాంగ్రెస్ గెలిచేది లేదు.. సచ్చేది లేదు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ఒక్కటే ఉంటది. రైతుల దెబ్బకు కాంగ్రెసోళ్లు మూటె ముళ్లె సర్దుకోవాలి.

**- ప్రహ్లాదరెడ్డి, రైతు, ఉప్పల, అయిజ**

## 24గంటల కరెంట్‌తో గోస తప్పింది

గత ప్రభుత్వాలు రోజుకు షిఫ్టుల వారీగా మూడు గంటలు మాత్రమే ఇచ్చేవారు. అదికూడా రాత్రి వేళలో ఒక వారం, పగటి పూట ఒక వారం కరెంట్ ఉండేది. రాత్రివేళలో కరెంట్ కోసం పడిగాపులు కాస్తు పంట పొలాల్లోనే నిద్రించేవారం. ఆ చీకట్లో ఎలా గడిపామో ఇప్పుడు వాటిని గుర్తుచేసుకుంటే భయం వేస్తుంది. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో వ్యవసాయం సాఫీగా సాగుతుంది. దీంతో ఎప్పుడైన పంటకు నీరు పెట్టుకునే అవకాశం లభించడంతో కరెంట్ గోస తప్పింది. సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని రైతులు పండుగలా చేసుకోవాలనే ఉద్దేశంతో రైతులకు కావాల్సిన సాగునీరు, 24 గంటల కరెంట్, రైతుబంధు, రైతుభీమా తదితర పథకాలను అందజేస్తు రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు. సీఎం కేసీఆర్‌తోనే వ్యవసాయం బాగుపడింది. ఏదిఏమైనా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నదే మా ఆకాంక్ష.

**-పార్వతమ్మ, రైతు, పెద్దమార్, చిన్నంబావి మండలం**





## ఆఫీసుల చుట్టూ తిరగాల్సిందే..

గతంలో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూ నా భూమి వివరాలు చూసుకుంటుంటి. తెలంగాణ వచ్చినకం కేసీఆర్ మాకు అండగా ఉంటూ భూమి వివరాలు సులువుగా తెల్సుకునేందుకు ధరణి తీసుకొచ్చిండు. ఇప్పుడైతే భూమి వివరాలు కావాలంటే నా ఫోన్‌లో ధరణి సైట్ ఓపెన్ చేసి చూసుకోవచ్చు. భూమి భద్రతతోపాటు అధికారుల చుట్టూ తిరిగే పని తప్పింది. ధరణి వచ్చినంక రిజిస్ట్రేషన్ బాధలు తగ్గినయ్. తక్కువ సమయంలో పని పూర్తయితుంది. అప్పుడైతే వారాలకు వారాలు ఆఫీసుల సుట్టూ తిరుగుతుంటిమి. ఇప్పుడైతే 15నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ చేస్తున్నరు. ధరణితో దళారీ వ్యవస్థ కనిపిస్తలేదు. ఇది వచ్చినాకనే రైతులకు భూరికార్డులపై ధైర్యం పెరిగింది. ధరణిని వద్దన్న వాళ్లకు మేమే బుద్ధి చెప్తం. కాంగ్రెస్ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయకుండా.. రైతులకు అండగా నిలిచిన కేసీఆర్ పథకాలపై విషంగక్కుతున్నరు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెసోళ్లకు సోయి తెప్పిస్తం.

**- భరతసింహారెడ్డి, రైతు, తుమ్మలపల్లి, రాజోళి మండలం**

## రికార్డులన్నీ తారుమారైతయ్..



తెలంగాణ ప్రభుత్వం రికార్డులన్నీ పక్కాగా చేసి రైతులు ఎప్పుడైన చూస్కునేలా ఆన్‌లైన్‌లో భద్రపర్చింది. గతంలో పైరవారు, పహాణీ, ఆర్ఓఆర్ అన్ని రికార్డుల్లో రాసి ఉంచేవారు. రికార్డులు అవసరం ఉన్నపుడు తీయడం, పెట్టడంతో అవి చిరిగిపోయెవి. రికార్డులు మార్పులు, చేర్పులు చేయాలన్నా వాటిని తీసి మార్చేవారు. ధరణి ఏర్పాటు తరువాత క్రయవిక్రయాలన్నీ ఆన్‌లైన్‌లోనే కొనసాగుతున్నది. భూమి అమ్మడం, కొనడం అయ్యాక వారం వారంలోగా పట్టాదారు పాసుపుస్తకం ఇంటికే వస్తుంది. దీంతో రైతులు నిశ్చింతగా ఉంటున్నరు. కాంగ్రెస్ పార్టీ వాళ్లు ధరణిని రద్దు చేసి భూమాత పోర్టల్ తీసుకొస్తమని చెప్తున్నరు. వారు తెచ్చే కొత్త పోర్టల్ ద్వారా మళ్లీ రికార్డులన్నీ తారుమారయ్యే అవకాశం ఉంది. ధరణి ఇలాగే కొనసాగించాలి.

**- సీతారామిరెడ్డి, రైతు, చెన్నిపాడు, మానవపాడు మండలం**



## నాలుగు తరాల రైతులు నష్టపోయిండ్రు..

కాంగ్రెస్ పాలనలో నాలుగుతరాల రైతులు నష్టపోయిండ్రు. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక సీఎం కేసీఆర్ కరెంటు కష్టాలు లేకుండా చేసినాడు. ఆర్డీఎస్ నంపచి సాగునీరు పుష్కలంగా పారుతుంది. అప్పట్ల బోర్లు ఉన్నా కరెంటు లేక ఇబ్బందులు పడినం. ఇప్పుడైతే ఆ ఇబ్బందే లేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు సేనుకు పోయి నీళ్లు పారవెడ్తున్నం. నీళ్లు పుష్కలంగా ఉన్నయ్. నా పొలానికే కాకుండా పక్క రైతులకు కూడా అందిస్తున్నా. పంటకు పెట్టుబడి, గిట్టుబాటు ధర, రైతుబంధు, రైతుబీమా ఇలా అనేక పథకాలు రైతులకు శానా మేలు చేస్తున్నయ్. ఈ రోజు కాంగ్రెసోల్లు వచ్చి మీకు మేలు జేస్తం.. ఓట్లెయ్యమని అడుగుతున్నరు. కేసీఆర్ కాకుండా ఇంకెవరూ న్యాయం చేయరని మాకు తెలుసు. కనుక ఎవ్వరి మాటలు నమ్మం. సాగునీటి కోసం తుమ్మిళ్ల లిఫ్ట్ ఏర్పాటైంది. రిజర్వాయర్లు కూడా పూర్తి చేస్తమని శాంతినగర్ సభలో సీఎం కేసీఆర్ మాటిచ్చారు. అదే జరిగితే సాగునీటికి శాశ్వత పరిష్కారం జరిగినట్లే.

**- బాషా, జూలేకల్, వడ్డేపల్లి మండలం**